క్లుప్తంగా

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

శంకర్‌పల్లి: రైతులకు 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు శంకర్‌పల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రం వైద్యాధికారి మానస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పశుగ్రాస విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, భూమి పట్టా పాస్‌బుక్ జిరాక్సులతో ప్రాథమిక పశువైద్య కేంద్రానికి హాజరవ్వాలన్నారు.

ఉద్యోగ విరమణ సహజమే

ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య



లక్ష్మారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమేనని ఎస్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యా.పోచయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన లక్ష్మారెడ్డి ఉద్యోగవిరమణ పొందడంతో ఆయనకు శుక్రవారం వీడ్కోలు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. శేషజీవితం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు శర్మ, ఉపాధ్యాయులు ఆంజనేయులు, రేణుక, వాణిశ్రీ, నర్సింలు, విద్యార్థులు తదితరులున్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

షాబాద్: వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు నర్సింలు, చెన్నయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్‌లో ఏబీజీ హాస్పిటల్స్, ఏఏపీఏహెచ్-హెచ్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో లివర్ స్కానింగ్, రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సుమారు 85 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జాకీర్ షరీఫ్, రాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం వద్ద బాధిత రైతు

షాబాద్: విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని వెంకమ్మగూడలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లూరి అశోక్‌కు చెందిన ఆవు తన పొలంలో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్ తగిలి విద్యుత్‌షాక్‌కు గురై వెంటనే మృతి చెందింది. రోజుకు పది లీటర్ల పాలు ఇచ్చే ఆవు చనిపోవడంతో బాధిత రైతు తనను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నాడు. ఆవు విలువ సుమారు రూ.1.5లక్షలు ఉంటుందన్నారు.

అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వండి

కడ్తాల్: సమగ్ర కుటుంబ సర్వే 2024లో పాల్గొన్న ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. శుక్రవారం ఎంపీడీఓ సుజాతకు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు మల్లయ్య, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

కడ్తాల్: ఆపదలో ఉన్న వారికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలో ఇటీవల ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున నలుగురికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తులసీరాం, నర్సింహగౌడ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ యాదయ్య ఉన్నారు.

జోరు వానలు

పొలం పనుల్లో రైతులు

- రోడ్లు పాడై ఇబ్బంది పడుతున్న ప్రజలు

షాబాద్: అదును దాటుతున్నా సరైన వర్షాలు లేక కలవరపడుతున్న కర్షకులకు ఊరట లభించింది. వారం రోజులుగా కురుస్తున్న మోస్తరు వానలు పత్తి, మొక్కజొన్న, వరితో పాటు ఆరుతడికి ప్రాణం పోసినట్లయింది. వాడు దశకు చేరిన చేలు నిగనిగలాడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు.

జోరుగా వరి నాట్లు

కొందుర్గు: వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతన్నలు కరిగెట పనుల్లో నిమగ్నమయ్యారు. గతేడాది మండలంలో ఐదువేల ఎకరాలు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 6,500 ఎకరాలు వరిసాగు చేశారు. బోర్లల్లో నీళ్లు తక్కువగా ఉన్నప్పటికి వరుసగా కురుస్తున్న వర్షాలకు రైతులు కరిగెట పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు ఇప్పటికే వరినాట్లు వేసే పనుల్లో బీజీగా ఉన్నారు.

చిత్తడిగా మారిన రోడ్డు

షాబాద్: మండల పరిధిలోని ఎర్రోనిగూడకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. వరుస వర్షాలు కురుస్తుండడంతో గ్రామానికి వచ్చే రోడ్డు చిత్తడిగా మారింది. రైతులు, వాహనదారులు నానా అగచాట్లు పడుతూ ప్రయాణిస్తున్నారు. పాలకులు స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

మూడు కిలోమీటర్లకు ముప్పు తిప్పలు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని మోకిల-టంగుటూరు రోడ్డు వర్షాల కారణంగా బురదమయంగా మారింది. దీంతో టంగుటూరు ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 2019లో సంగారెడ్డి జిల్లా వెలిమల శివారు నుంచి చేవెళ్ల మండలం తంగెడుపల్లి వరకు 11 కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రహదారి పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ మోకిల నుంచి టంగటూర్ వరకు మూడు కిలో మీటర్ల కోర్టు వివాదాల కారణంగా పనులు నిలిచి పోయాయి. దీంతో టంగుటూరు వాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు దృష్టి సారించి, పనులు పూర్తి చేయాలని కోరుకుంటున్నారు.

బురదమయంగా మారిన సర్వీస్‌రోడ్లు

కొత్తూరు: కొత్తూరు-షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు బైపాస్ వెంట సర్వీస్‌రోడ్లు బురదమయంగా మారాయి. రోడ్డు నిర్వాహణ చూసే కాంట్రాక్ట్ సంస్థ సర్వీస్‌రోడ్ల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో రోడ్లు వరద నీటి ప్రవాహానికి కోతకు గురికావడంతో పాటు పలుచోట్ల మురుగు పారుతోంది. దానికి తోడు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక రోడ్డు ధ్వసమైంది. చిన్న చిన్న అవసరాలకు సైతం సమీప గ్రామాల ప్రజలు ప్రధానరోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. సర్వీస్‌రోడ్లను అభివృద్ధి చేయాలని పలుమార్లు పాలకులకు విన్నవిస్తున్నా ఎలాంటి ఫలితం లేదు. ఇప్పటికైనా కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



శంకర్‌పల్లి: మోకిల-టంగుటూర్ రోడ్డు దుస్థితి



షాబాద్: సంకెపల్లిగూడలో సిద్ధం చేసుకున్న నారుమడులు



కొత్తూరు: బురదమయంగా సర్వీస్ రోడ్డు



షాబాద్: ఎర్రోనిగూడకు వెళ్లే రోడ్డు దుస్థితి

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో కురుస్తున్న వర్షాలకు అయ్యవారిపల్లి సమీపంలోని వాగు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాగు మీదుగా ప్రయాణించలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాగు ఉధృతి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని.. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరుతున్నారు. వాగు పరిసర ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టి రాకపోకలను నిలిపి వేయాలని ప్రజలు కోరుతున్నారు.



షాద్‌నగర్ రూరల్: పొంగిపొర్లుతున్న అయ్యవారిపల్లి వాగు



కొందుర్గు: ముట్పూర్‌లో ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతులు



కొందుర్గు: మహదేవ్‌పూర్‌లో వరినాట్లు వేస్తున్న మహిళలు

శభాష్.. జశ్వంత్



సీఐ భూపాల్‌శ్రీధర్‌కు ఐ ఫోన్ అందజేస్తున్న విద్యార్థి జశ్వంత్

చేవెళ్ల: తనకు దొరికిన ఐఫోన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు ఓ విద్యార్థి. వివరాలు.. చేవెళ్ల బస్‌స్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక శ్రీసాయిచైతన్య పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి జశ్వంత్ తన స్వగ్రామం పామెనకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వెళ్తుండగా రోడ్డుపై ఐఫోన్ కనబడింది. దీంతో విద్యార్థి వెంటనే తన తండ్రి అశోక్‌తో కలిసి చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌కు అప్పగించాడు. ఫోన్ గమనించిన సీఐ దీని విలువ రూ.లక్ష ఉంటుందని విద్యార్థిని అభినందించాడు. విద్యార్థిని వివరాలు తెలుసుకుని పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డికి ఫోన్ చేసి మీ పాఠశాల విద్యార్థి పలువురికి ఆదర్శంగా నిలిచాడని విషయం వివరించారు. విద్యార్థి తండ్రి అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించాడు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

శంకర్‌పల్లి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు శుక్రవారం శంకర్‌పల్లి టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తహసీల్దార్ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి భగవంత్ రాజ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, తదితర సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఉదయశ్రీ, ప్రధాన కార్యదర్శి గుణవంత్, శ్రీనివాస్, శివ కుమార్ పాల్గొన్నారు.



చేవెళ్ల: మున్సిపల్ కార్మికులతో సమావేశమైన దేవేందర్

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేద్దాం

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చామని ఈకార్యక్రమాన్ని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్‌పే చెల్లించాలన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి పరిష్కరించాలన్నారు. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులతో వెట్టి చాకిరి

మొయినాబాద్: వలస కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న మసాలా కంపెనీపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అమ్డాపూర్ రెవెన్యూలో పరిధిలో ఉన్న బాలాజీ మసాలా కంపెనీని సీఐటీయూ నాయకులు సందర్శించి వలస కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలాజీ మసాలా కంపెనీ యాజమాన్యం వలస కార్మికుల శ్రమను దోచుకుంటోందన్నారు. కనీస నిబంధనలు పాటించకుండా కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తూ 12–14 గంటలు పనిచేయిస్తున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా కార్మికులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కంపెనీ ఎదుట కనీసం బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. కార్మికశాఖ అధికారులు స్పందించి సదరు కంపెనీపై చర్యలు తీసుకుని వలస కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, నాయకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద, మధురాపూర్ గ్రామాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్(ఎస్‌బీఎంజీ) కమిటీ సభ్యులు లక్ష్మి, ఉమ, ఎస్‌బీఎం ఇన్‌చార్జి మీనాక్షి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్, దేవాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాలతో పాటుగా గ్రామంలోని ఇళ్లను సందర్శించారు. మరుగుదొడ్ల నిర్వహణ, మౌలిక వసతులు, ఇంకుడు గుంతల ఏర్పాటు, రికార్డుల నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించారు. గ్రామంలో స్వచ్ఛ భారత్, సానిటేషన్ నిర్వహణ, డంపింగ్ యార్డును పరిశీలించారు. గ్రామంలో ప్రతిరోజు చెత్త సేకరణ చేపడుతున్నారా, వ్యక్తిగత మరుగుదొడ్లను వాడుతున్నారా, తాగునీటి సరఫరా సక్రమంగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతో పాటుగా ఇంటి పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్తను గ్రామ పంచాయతీ కార్మికులకు అందజేయాలని సూచించారు. తమ ఇంటి ఆవరణలో తప్పని సరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, ప్రతిఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని అన్నారు. నీటిని కాచి వడబోసిన తరువాతనే తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని అన్నారు. ప్రజలందరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జయంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వంశీకృష్ణ, బాసిత్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కారోబార్‌లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మధురాపూర్‌లో వివరాలు సేకరిస్తున్న ఎస్‌బీఎంజీ సభ్యులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన జంగయ్యకు రూ.34 వేలు, ఆమనగల్లు పట్టణ వాసి సత్తెమ్మకు రూ.52 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు నగరంలోని తన నివాసంలో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎవరికీ ఒక్క రేషన్‌కార్డు అందలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భగవాన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, జగన్‌గౌడ్, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పడకల్ గ్రామం మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలంను ఎమ్మెల్యే పరామర్శించారు.

గులాబీ జెండా ఎగురవేద్దాం

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మాట్లాడుతున్న అంజయ్య యాదవ్

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి శివారులోని ఏవీ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సంసిద్ధులై ఉండాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ చేసిన ప్రగతి.. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న పనుల్లో వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేద్దామన్నారు. ఈ సమావేశంలో నాయకులు రవీందర్ యాదవ్, నారాయణరెడ్డి, గణేశ్, నరేందర్, నటరాజన్, రాంబల్ నాయక్, రాజావరప్రసాద్, మిట్టూ నాయక్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మె శ్రీలత, ఎమ్మె సత్యనారాయణ, దేవేందర్ యాదవ్ పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణ కమిటీ

ఆమనగల్లు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి మున్సిపాలిటీ పరిధిలో విపత్తు నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, వార్డు ఆఫీసర్ రమేశ్‌నాయక్‌ల ఆధ్వర్యంలో కమిటీని నియమించామని పేర్కొన్నారు.

బీజేపీ సత్తా చాటుదాం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య



కొందుర్గు సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొందుర్గు: స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం చౌదరిగూడలో పార్టీ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మండలంలో కాషాయ జెండా ఎగురవేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ అభ్యున్నతికి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, నాయకులు శ్రీనివాసు, మనోహర్ రెడ్డి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

మండల వ్యవసాయ అధికారి కృష్ణమోహన్

షాబాద్: రైతులు యూరియా వాడకం తగ్గించి నానో యూరియా, డీఏపీ వాడాలని మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణమోహన్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని నాగర్‌గూడలో మల్లికార్జున ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే డీలర్ల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు తప్పక ఇవ్వాలన్నారు. ఎమ్ఆర్‌పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి షాపు ఎదుట స్టాక్ బోర్డు పెట్టాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. గడువు ముగిసిన పురుగు మందులు, విత్తనాలు విక్రయించొద్దన్నారు. ఈ తనిఖీల్లో డీలర్లు శేఖర్, సుధాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

అందుబాటులో యూరియా

కేశంపేట: రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు. మండలానికి ఇప్పటికే 900 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని.. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్వర్యంలో 25 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. అవసరం ఉన్న రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్సులు అందజేసి కేశంపేట పీఏసీఎస్ షాపు నందు సంప్రదించాలన్నారు.



కేశంపేట: రైతుకు యూరియా పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి శిరీష